


బస్సెక్కుదాం.. బడికి పోదాం

పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడంతో.. విద్యార్థులకు ఉచిత, రాయితీ బస్సు పాస్‌లు అందజేసేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. - 8లో▸



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
38.5°/27.3°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	36.0	29.5
కాకినాడ	32.1	27.3
అమలాపురం	38.5	29.0

న్యూస్‌రీల్

విశేషాలంకరణలో దర్శనమిచ్చిన తలుపులమ్మతల్లి

తుని రూరల్: ఆషాఢమాసం ప్రారంభమైంది. తొలిరోజు సోమవారం లోవదేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారికి వేద పండితులు విశేషాలంకరణ చేశారు. సోమవారం నుంచి జూలై 17 వరకూ అమ్మవారి ఆషాఢమాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రధానాలయంలో స్వయంభూ వెలసిన అమ్మవారికి, బాలాలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఆషాఢ మాసం సందర్భంగా ఈ నెల 25న ఆదివారం వివిధ రకాల మట్టిగాజులతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పిస్తామని ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు తెలిపారు.

తొండంగి మండలంలో భారీ వర్షం

తొండంగి: కొద్ది రోజులుగా భానుడి ప్రతాపానికి విలవిల్లాడిన ప్రజలకు సోమవారం ఉపశమనం లభించింది. మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం కురిసిన వర్షం ఊరట కలిగించింది. తెల్లవారుజాము నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. తర్వాత గంట పాటు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వర్షానికి పల్లపు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి. ఈదురు గాలుల ప్రభావానికి పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. కొద్ది రోజులుగా ఎండ తీవ్రతకు ఇబ్బంది పడిన ప్రజలు వాతావరణం చల్లబడటంతో సేద తీరారు. రైతులు వ్యవసాయ వరిసాగు పనులకు సన్నద్ధమవుతున్నారు.

లోవకు హుండీల ద్వారా రూ.22 లక్షల ఆదాయం

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.22,10,026 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. దేవదాయ ధర్మాదాయశాఖ పెద్దాపురం తనిఖీ అధికారి సీహెచ్ ఉదయబాబు నాయుడు పర్యవేక్షణలో సోమవారం లోవదేవస్థానంలో హుండీలను తెరిచి ఆదాయం లెక్కించారు. నాణేల రూపంలో రూ.80,352, నోట్ల రూపంలో రూ.21,29,674 వెరసి మొత్తం రూ.22,10,026 ఆదాయం లభించిందన్నారు. 28 రోజులకు లభించిన ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేశామన్నారు. చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తలు, శ్రీవారి సేవకులు, దేవస్థానం సిబ్బంది నగదు లెక్కింపులో పాల్గొన్నారు.

గూడ్స్ బోగి నుంచి పొగలు

అప్రమత్తమైన అధికారులు



సామర్లకోటలో గూడ్స్ బొగ్గు బోగిలోనికి నీరు పెడుతున్న అగ్నిమాపక అధికారులు

సామర్లకోట: బిలాస్‌పూర్ డివిజన్ నుంచి సామర్లకోట వస్తున్న గూడ్స్ బొగ్గు బోగి నుంచి పొగలు రావడంతో రైల్వే అధికారులు అప్రమత్తం కావడంతో సోమవారం ప్రమాదం తప్పింది. గూడ్స్ రైలు పిఠాపురం వచ్చిన తరువాత ఒక బొగ్గు బోగి నుంచి పొగలు వస్తున్న విషయాన్ని రైల్వే స్టేషన్ మాస్టర్ గమనించారు. వెంటనే సామర్లకోట స్టేషన్ మేనేజరు ఎం.రమేష్‌కు సమాచారం ఇచ్చారు. దాంతో గూడ్స్ రైలును ఖాళీగా ఉండే రైల్వే గూడ్స్ యార్డుకు తరలించి, పెద్దాపురం అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. పెద్దాపురం అగ్నిమాపక వాహన సిబ్బంది పొగ వస్తున్న బొగ్గు బోగిలో పూర్తిగా నీటిని నింపడంతో పొగలు అదుపులోకి వచ్చాయి. బొగ్గు లోడ్‌తో ఉన్న గూడ్స్ రైలు కొండపల్లి వెళుతున్నట్లు స్టేషన్ మేనేజరు రమేష్ తెలిపారు.

ఆరోగ్యానికి చేపట్టాల్సిందే..

- మృగశిర కార్తెలో 'మీనం' దివ్యౌషధం
- వాతావరణ మార్పులతో రోగ నిరోధక శక్తిపై ప్రభావం
- చేపల ఆహారం తింటే పెరుగుదల
- గోదారి సీమలో దొరికే చేపలకు, ఆ కూరలకు ప్రత్యేక గుర్తింపు



చేపల పులుసు

సాక్షి, అమలాపురం: భారతీయ సంప్రదాయం ప్రకారం ఒక్కో కార్తెలో ఒక్కో రకం ఆహారం తీసుకోవడం ఆనవాయితీ. ఇటువంటి ఆహారపు అలవాట్లు ప్రకృతిలో జరిగే మార్పులకు అనుగుణంగా ఆరోగ్యానికి మేలు చేసేవి కావడం విశేషం. ఒక్కో మాసంలో ఒక్కో రకం ఆహారం తీసుకోవడం గోదావరి వాసులకు సంప్రదాయంగా, ఆనవాయితీగా వస్తోంది. వీటిలో పండ్లు, కూరగాయల వంటి శాకాహారమే కాదు. చేపల వంటి మాంసాహారాలు కూడా ఉన్నాయి. ప్రస్తుత మృగశిర కార్తెలో చేపలు ఆహారంగా తీసుకోవడం కూడా ఈ ఆనవాయితీల్లో ఒకటి.

మృగశిర కార్తె రోజుల్లో చేపలు తినడం ఆరోగ్యానికి మేలని నమ్మకం. రోళ్లు పగిలే స్థాయిలో ఎండలను మోసుకొచ్చిన రోహిణీ కార్తె ముగిసిన వెంటనే మృగశిర మొదలవుతుంది. తొలకరి వర్షాలు ఆరంభమవుతాయి. ఈ క్రమంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. ప్రకృతిలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. ఫలితంగా అనేక హానికర సూక్ష్మ క్రిముల వంటివి ఉత్పత్తి అవుతాయి. ఇటువంటి వాతావరణంలో రోగ నిరోధక శక్తి తగ్గి జ్వరం, దగ్గు, శ్వాస సంబంధ సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుంది. చేపలు ఆహారంగా తీసుకోవడం వల్ల ఇటువంటి అనారోగ్యాల నుంచి



చందువా వేపుడు



చేప వేపుడు


కాపాడుకోవచ్చు. ఇది శాస్త్రీయంగా కూడా నిరూపితమైంది. ఈ సీజన్‌లోనే హైదరాబాద్‌లో బత్తిని గౌడ్ సోదరులు 'చేప ప్రసాదం' ఇస్తుంటారు. దీని వల్ల ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు తగ్గుతాయని విశ్వసిస్తారు.

రుచిలో మిన్న.. గోదారి చేప

నెల్లూరు అంటే కేవలం చేపల పులుసు మాత్రమే గుర్తుకు వస్తుంది. అదే గోదారి జిల్లాలంటే పులస చేపల పులుసు ఒక్కటే కాదు.. ఇక్కడ దొరికే రకరకాల చేపలు.. వాటితో తయారు చేసే రకరకాల వంటలు గుర్తుకొస్తాయి. గోదావరి నీటి మాహాత్మ్యమో.. లేక వండటంలో గొప్పతనమో చెప్పలేం కానీ గోదావరి చేప కూరలు తినాల్సిందేనని మాంసాహార ప్రియులు లొట్టలు వేసుకుంటూ చెబుతారు. చందువా వేపుడు, పండుగొప్ప ఇగురు, కొర్రమేను కూర, కొయ్యింగల పులుసు, గుమ్మడి చుక్క, కోన చేపల డీప్ ఫ్రై వంటివి తింటే జిహ్వా వహ్వా అనాల్సిందే. పెద్ద చేపల్లోనే కాదు.. చిన్న వాటిల్లో పచ్చి మెత్తళ్ల మామిడి, ఎండు మెత్తళ్ల వేపుడు, కట్టి చేపలు, బొమ్మిడాయిల పులుసు, రామల ఇగురు, చింతకాయ చిన్న చేపలు, చీరమేను కూరలకు ఫిదా కాని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఈ చేపలతో పులుసులు, కూరలు, ఇగురులు, వేపుళ్ల వంటివి చేయడంలో గోదావరి వాసులు సిద్ధహస్తులు. ఇక ఉప్పు చేప పప్పుచారు, ఆర్చిన చేప ఇగురు, టమాటా రసం తినాలే కానీ వర్ణించేందుకు మాటలు చాలవు. ఇవే కాదు జెల్లలు, మాతలు, గొరకలు, బొచ్చు, శీలావతి, మోసు, గోదావరి ఎర్రమోసు, వంజరం, గులిగింతలు, మట్టకరస ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో రకాలు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి నగరాల్లో నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు ఒక్కటే కాదు.. గోదారోళ్ల చేపల పులుసు, గోదావరి చేపల కూరల పేరుతో రెస్టారెంట్లు కూడా వెలిశాయంటే ఇక్కడ వండే రకాలకు ఉన్న డిమాండ్ అర్థం చేసుకోవచ్చు.

చేపలు.. కోకొల్లలు

మాంసాహారులకు కార్తెతో సంబంధం లేదు. ఏడాది పొడవునా చేపలను ఆహారంగా తీసుకుంటారు. గోదావరి జిల్లాల్లో కూడా చేపలకు కొదవే లేదు. విస్తారమైన సముద్రం, అఖండ గోదావరితో పాటు నదీపాయలు, డెల్టా పంట కాలువలు, పర్రభూములు, మెట్టలో సాగు నీటి చెరువులు, ప్రాజెక్టులు.. ఏజెన్సీని ఆనుకుని ఉండే సహజసిద్ధమైన చెరువులు (ఆవలు).. ఆపై వేలాది ఎకరాల్లో చేపల సాగు.. ఇలా ఎటు చూసినా రకరకాల చేపలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. కొన్ని రకాల చేపలు ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి అవుతూంటాయి.



లెక్కకు మిక్కిలిగా ఔషధ గుణాలు

- చేపల్లో ఔషధ గుణాలు అపారంగా ఉంటాయి.
- ఇందులోని ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ గుండెకు ఆరోగ్యాన్నిస్తాయి. రక్తం గడ్డకట్టడాన్ని తగ్గిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తాయి. గుండె జబ్బులు, ఆస్తమా తదితర అనారోగ్య సమస్యలకు అడ్డుకట్ట వేయాలంటే చేపలు తినాలని వైద్యులు చెబుతారు.
- మనిషి తన రోజువారీ కార్యకలాపాలు సాఫీగా సాగించేందుకు మెదడులో న్యూరాన్లతో కూడిన గ్రే మ్యాటర్ ఉంటుంది. చేపలు తింటే ఇది మరింత చురుకుగా పని చేస్తుంది.
- వయస్సు మీద పడుతున్న సమయంలో మెదడులోని కణాల క్షీణతను నిరోధించడానికి చేపల ఆహారం తోడ్పడుతుంది. దీనివల్ల అల్జీమర్స్ వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది.
- టైప్–1 డయాబెటిస్‌ను నియంత్రిస్తుంది.
- చేపలు తింటే దృష్టి లోపాలు, అంధత్వం వంటివి తగ్గుతాయి.
- గర్భిణులు, పిల్లలకు పాలిచ్చే స్త్రీలకు చేపలు తినడం ఎంతో మేలు.
- చిన్న పిల్లలకు సరిపడే స్థాయిలో పాలు ఇవ్వలేనప్పుడు బాలింతలకు మెత్తళ్ల కూర వండి పెట్టడం సర్వసాధారణం. అలాగే బైపాస్ ఆపరేషన్ చేయించుకున్న వారికి పచ్చి మెత్తళ్లతో పాటు, ఎండు మెత్తళ్లు, చిన్న చేపలు (చేదు చేపలు) పత్యంగా అందిస్తారు. సొరచేపల ద్వారా శృంగార సామర్థ్యం పెరుగుతుందని నిపుణులు చెబుతారు.

ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు



"చేపలతో ఎన్నో రకాలుగా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. చేపల్లో ఉండే ప్రొటీన్ సులువుగా అరిగిపోతుంది. వృద్ధాప్యంలో సహజసిద్ధంగా వచ్చే రుగ్మతలు చాలా వరకూ దూరమవుతాయి. సహజసిద్ధంగా పెరిగే చేపల్లో మేలు చేసే ప్రొటీన్, ఇతర విలువలు ఉంటాయి."

– పిండి సాయిబాబు, విశ్రాంత జంతుశాస్త్ర విభాగాధిపతి, ఎస్‌కేబీఆర్ కాలేజీ, అమలాపురం



కొర్రమేను ఇగురు



బొమ్మిడాయిల పులుసు

సత్యదేవుని దర్శించిన ఎన్‌సీఎల్‌టీ సభ్యుడు



అన్నవరం: జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ మెంబర్ (ఎన్‌సీఎల్‌టీ) బలరామ్‌దాస్ సోమవారం కుటుంబ సమేతంగా రత్నగిరిపై సత్యదేవుని దర్శించి, స్వామివారి వ్రతమాచరించారు. ఆలయం వద్ద వారికి ఏఈఓ కృష్ణారావు ఆధ్వర్యంలో పండితులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఏఈఓ కృష్ణారావు బహూకరించారు. ఆయన వెంట శంఖవరం ఆర్ఐ ప్రసాద్ తదితరులు ఉన్నారు. అన్నవరం ఇన్‌చార్జి ఎస్ఐ అజయ్ బాబు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలీస్ స్పందనకు 69 ఫిర్యాదులు



పోలీస్ స్పందనలో ఫిర్యాదుల సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కాకినాడలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 69 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ సతీష్‌కుమార్ ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఆషాఢంలోనూ తగ్గని రద్దీ

సత్యదేవుని దర్శించిన 25 వేల మంది

అన్నవరం: ఆషాఢ మాసం ప్రారంభమైంది. ఈ మాసంలో శుభకార్యాలు జరగవు. దీంతో రత్నగిరికి భక్తుల తాకిడి పెద్దగా ఉండదు. దీనికి భిన్నంగా సోమవారం రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు 1,500 జరిగాయి. అన్నివిభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. స్వామివారి గర్భాలయ ప్రదక్షిణ దర్శనానికి అరగంట, సాధారణ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు.

వాతావరణం కూల్‌కూల్

గత వారం రోజులుగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రత్నగిరిపై భక్తులు అల్లాడిపోయారు. సోమవారం తెల్లవారుజామున వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తుండడంతో ఆహ్లాదకరంగా మారింది. దీంతో సత్యదేవుని ఆలయానికి వచ్చిన భక్తులు సేదదీరారు.

నేడు సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కింపు

సత్యదేవుని హుండీలను మంగళవారం తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్టు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత జ్యేష్ఠ మాసంలో భారీ సంఖ్యలో వివాహాలు జరిగినందున వేల సంఖ్యలో నవదంపతులు, భక్తులు సత్యదేవుని సన్నిధికి వచ్చారు. వీరంతా స్వామివారిని దర్శించి, వ్రతాలు ఆచరించి స్వామివారికి కానుకలు సమర్పించారు. దీంతో ఈసారి స్వామివారికి హుండీల ద్వారా సుమారు రూ.3 కోట్లు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

ఉత్తమ ఆరోగ్యమిత్రలకు పురస్కారాలు

కాకినాడ సిటీ: ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాలు అమలులో భాగంగా లబ్ధిదారులకు ఉత్తమ సేవలందించిన ఆరోగ్యమిత్రలకు రాష్ట్ర ప్రభుత్వం సేవా ఆరోగ్య మిత్ర పురస్కారాలను అందజేస్తోంది. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఏప్రిల్ నెలకు కొప్పిశెట్టి బుజ్జి (గవర్నమెంట్ జనరల్ హాస్పటల్, కాకినాడ), మే నెలకు గీసాల శ్రీను (రాఘవ హాస్పటల్, కాకినాడ)కు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పురస్కారాలు అందజేశారు. వీరికి ప్రశంసా పత్రం, రూ.5వేలు నగదు అందజేశారు. ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పి రాధాకృష్ణ, జిల్లా మేనేజర్ కె నవీన్, టీం లీడర్ రాయుడు బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు చర్యలు:

ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల)ల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా ఎన్నికల, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ప్రతి నెల ఈవీఎం, వీవీప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు.

స్పందనకు 316 అర్జీలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం స్పందనలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం లెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా, డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి జెడ్పీ సీఈవో ఎ రమణా రెడ్డి, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ఈడీలు ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, డీఎస్ సునీతలతో కలసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాలు, నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు. పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 316 అర్జీలు స్వీకరించారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా



ఆరోగ్య మిత్ర పురస్కారాన్ని అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

జగనన్న సురక్ష కార్యక్రమంపై సన్నద్ధత : కలెక్టర్

అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా సూచనలు

కాకినాడ సిటీ: జగనన్న సురక్ష కార్యక్రమం జూలై 1న ప్రారంభం కానున్న నేపథ్యంలో మండల, మున్సిపల్ అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది పూర్తి సన్నద్ధతతో ఉండాలని కలెక్టర్ కృతికా శుక్లా పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం జగనన్న సురక్ష, గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణ పనుల పురోగతి, విద్యాశాఖకు సంబంధించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే, హౌసింగ్ తదితర అంశాలపై ఆమె జేసీ ఇలక్కియ, డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, జెడ్పీపీ సీఈవో ఎ రమణారెడ్డి, డీపీవో ఆర్ విక్టర్, హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణిలతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే అన్ని మండల, మున్సిపల్ అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. బృందాలు తమకు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం గ్రామ, వార్డు సచివాలయం పరిధిలోని ప్రతి గృహాన్ని సందర్శించాలన్నారు. అవసరమైన సేవల వివరాలను, సమస్యలను అడిగి తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు. జనన, మరణ, వివాహ, కుల, ఆదాయ, కౌలు రైతు, ధ్రువీకరణ పత్రాలు ఈ క్యాంపులో అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి మండల, మున్సిపల్ టీమ్స్ సంబంధిత సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు ప్రత్యేక అవగాహన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 11 మండలాల్లో 121 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి చేశామన్నారు. సర్వే పనులు పూర్తయిన అన్ని గ్రామాల్లో గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాశ్వత భవనాలైన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. విద్యాశాఖకు సంబంధించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నవరత్నాలు ప్రజలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన గృహ నిర్మాణ పనులు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో సీపీవో పి త్రినాథ్, డీఈవో కెఎస్‌వీఎస్ అన్నపూర్ణ, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం శ్రీనివాస్, కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సముద్రంలో బోటు బోల్తా



సముద్రంలో బోల్తా పడిన బోటు

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తూ బోటు బోల్తా పడిన ఘటనలో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. మత్స్యకారుల కథనం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజానగరానికి చెందిన గరికిన నూకరాజుతో పాటు ఎనిమిది మంది మత్స్యకారులు అక్కడి తీరం నుంచి తన బోటుపై సోమవారం తెల్లవారుజామున సముద్రంలో వేటకు వెళ్లారు. వేట ముగించుకుని అమీనాబాదు తీరానికి వస్తుండగా కెరటాల ఉధృతికి బోటు ఒక్కసారిగా బోల్తా పడింది. అందులోని మత్స్యకారులు తోటి వారి సహాయంతో తీరానికి క్షేమంగా చేరుకున్నారు. బోటు సముద్రంలో ఉండగానే రెండు వలలు, మత్స్యసంపద పూర్తిగా కొట్టుకుపోయాయని, సుమారు రూ.6 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు.

బస్సెక్కుదాం..బడికి పోదాం



- ఉచిత, రాయితీ బస్సు పాసుల మంజూరుకు ప్రభుత్వం చర్యలు
- 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచితం
- దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రజా రవాణా శాఖ
- గత ఏడాది జిల్లాలో 52 వేల మందికి ప్రయోజనం

సద్వినియోగం చేసుకోవాలి



పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైనందున బస్సు పాస్‌ల జారీ ప్రక్రియను ప్రారంభించాం. ప్రభుత్వం అందించే బస్సు పాస్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. సదరం సర్టిఫికెట్ పొందిన దివ్యాంగులకు (విద్యార్థులు కాని వారు) 50 శాతం రాయితీతో బస్సు పాస్‌లు జారీ చేస్తున్నాం.

– కె.వెంకటేశ్వర్లు, మేనేజర్, రామచంద్రపురం ఆర్టీసీ డిపో

రాయవరం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. దూర ప్రాంతాలకు వెళ్లి చదివే విద్యార్థులు ఉదయాన్నే ఆయా స్కూళ్లు, కాలేజీలకు వెళ్లేందుకు వివిధ మార్గాలు ఎంచుకుంటారు. పల్లెల నుంచి పట్టణ ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, వాహన సౌకర్యం లేని వారు ఆర్టీసీ బస్సులలో వెళ్తారు. వీరి కోసం ప్రజా రవాణా శాఖ ఏటా ఉచిత, రాయితీ బస్సు పాసులు మంజూరు చేస్తోంది. జిల్లాలోని అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం ఆర్టీసీ డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత, రాయితీ బస్సు పాస్‌లు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు కౌంటర్లు ప్రారంభించారు. బస్సు పాస్‌లకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. పాస్‌లు కావాల్సిన వారు 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఆర్‌టీసీపీఏఎస్‌ఎస్.ఇన్' వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి, దరఖాస్తు చేసుకోవాలి. కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ జత చేయాలి. స్టడీ సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సెల్ నంబరు ఇవ్వాలి. దరఖాస్తులను సమీప డిపో మేనేజర్ పరిశీలించి, పాస్ మంజూరుకు సిఫారసు చేస్తారు. వీటిని మంజూరు కౌంటరులో ఇచ్చి, నిర్ణీత రుసుం చెల్లించి పాస్ పొందవచ్చు.

చదువులకు ఊతమిచ్చేలా..

- అక్షరాస్యతా శాతాన్ని పెంచేందుకు అందించే తోడ్పాటులో భాగంగా ప్రజా రవాణా శాఖ 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచితంగా ఏపీఎస్ ఆర్టీసీ బస్సు పాస్‌లు జారీ చేస్తుంది. ఇవి ఏడాది పాటు చెల్లుబాటు అవుతాయి. వీటి ద్వారా విద్యార్థులు తమ నివాసం నుంచి 20 కిలోమీటర్ల వరకూ బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చు. దీనికోసం విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి ధృవీకరణ పత్రం (బోనఫైడ్ సర్టిఫికెట్) సమర్పించాలి.
- మిగిలిన వారికి రాయితీతో బస్సు పాస్‌లు మంజూరు చేస్తారు. చదువుకునే ప్రతి విద్యార్థీ ఈ రాయితీ బస్సు పాస్ పొందవచ్చు. మొత్తం చార్జీలో ఒక వంతు మాత్రమే విద్యార్థి చెల్లించేలా ఈ పాస్‌లు జారీ చేస్తారు. విద్యార్థి నివాసం నుంచి 50 కిలోమీటర్ల వరకూ రాయితీ పాస్ జారీ చేస్తారు. బస్సు రూటు ఆధారంగా రాయితీ చార్జీని విద్యార్థులకు నిర్ణయిస్తారు. కళాశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించాలి. విద్యార్థి ఫొటో జత చేయాలి.
- పాస్ ధరతో పాటు సంవత్సరం గుర్తింపు కార్డు కోసం రూ.100, నెలవారీ గుర్తింపు కార్డు రూ.50, సర్వీసు చార్జీ రూ.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ బస్సు పాస్‌లను నెల, మూడు నెలలు, ఏడాది కాలపరిమితితో మంజూరు చేస్తారు. గడువు ముగిశాక రెన్యువల్ కోసం ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని, తిరిగి పొందాల్సి ఉంటుంది.
- సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకూ, ఐటీఐ, పారా మెడికల్ వంటి కోర్సులు చదివే వారికి మే నెలలో కూడా పాసులు మంజూరు చేస్తారు.
- ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక స్టేజీగా పరిగణించి, దూరాన్ని బట్టి రాయితీ ఇస్తారు.
- రామచంద్రపురం, రావులపాలెం, రాజోలు, అమలాపురం డిపోల నుంచి గత ఏడాది ఉచిత, రాయితీతో పాటు దివ్యాంగులకు సుమారు 52 వేల బస్సు పాస్‌లు అందజేశారు.
- దివ్యాంగులైన విద్యార్థులకు కూడా ఉచితంగా బస్సు పాస్‌లు అందిస్తున్నారు. దీనికోసం సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, అన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ సమర్పించాలి. మూడేళ్ల కాల వ్యవధితో పాస్‌లు జారీ చేస్తారు. ఐడీ కార్డుకు రూ.100 చెల్లించాలి.

22 నుంచి కళాసమ్మేళనం

- 14 గంటల పాటు నిర్విరామ నృత్య ప్రదర్శన
- ఐదు ప్రపంచ రికార్డులకు ప్రయత్నం



వివరాలు వెల్లడిస్తున్న జీబీ నారాయణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్థానిక ఆనం కళా కేంద్రంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ కళా సమ్మేళనం పేరిట జాతీయ స్థాయి నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు రాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు జీబీ నారాయణ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, రాధాకృష్ణ ట్రస్ట్, రాధాకృష్ణ కళాక్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫెస్ట్ రూబే–2023 పేరిట ఈ నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రూబే 40వ వార్షికోత్సవం సందర్భంగా 22వ తేదీ ఉదయం 5 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఐదు ప్రపంచ రికార్డుల కోసం 14 గంటల 2 నిమిషాల 2 సెకండ్ల పాటు రాధాకృష్ణ కళాక్షేత్రకు చెందిన 101 మంది విద్యార్థులతో 101 సార్లు హనుమాన్ చాలీసా నృత్య ప్రదర్శన ఉంటుందని వివరించారు. ఒకే వేదిక నుంచి వైదిక సిద్ధాంతంలో శ్రీనివాస కల్యాణం జరుగుతూండగా లలిత, జానపద పెళ్లిపాటలకు నృత్య ప్రదర్శన చేస్తామన్నారు. దీనిలో భాగంగా 23వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జాతీయ స్థాయి సంగీత, నృత్య పోటీలు, సాయంత్రం 6 నుంచి శ్రీనివాస కల్యాణం జరుగుతాయని తెలిపారు. 24వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జాతీయ స్థాయి సంగీత, నృత్య పోటీలు ఉంటాయన్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటల నుంచి చెరుకుమిల్లి సిరిచందన కూచిపూడి అరంగేట్రం ఉంటుందన్నారు. 25వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకూ జాతీయ స్థాయి సంగీత, నృత్య పోటీలు, సాయంత్రం 4 నుంచి సంగీత, నాట్య శాస్త్రాలపై ప్రముఖులతో చర్చా వేదిక, సాయంత్రం 6 నుంచి బహుమతి ప్రదానం నిర్వహిస్తామని నారాయణ వివరించారు. డాక్టర్ కుషల్ భట్టాచార్య (కోల్‌కతా), పోతిన శ్రీనివాస్ (హైదరాబాద్), గోరుగంతు ఉమాజయశ్రీ (రాజమహేంద్రవరం), తిరుపతి ఎస్వీ కళాశాల లెక్చరర్ తిరుపతి యాళ్ల శ్రీవాణి న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ కె.మాధవీలత, నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. శైవక్షేత్ర శివస్వామి (గుంటూరు), కాకినాడ సెట్రాజ్ సీఈఓ షేక్ ఇమ్రాన్, కూచిపూడి కళాకారిణి, పద్మశ్రీ శోభానాయుడు శిష్యురాలు యశోదా ఠాకూర్ కూడా హాజరు కానున్నారని తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి జేసీబీకి మంటలు

విద్యుదాఘాతంతో డ్రైవర్ మృతి



డ్రైవర్ సహదేవ్ మృతదేహం

రాజానగరం: ట్రాలీపై తరలిస్తున్న జేసీబీకి విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో విద్యుదాఘాతానికి గురై దానిలోని డ్రైవర్ మృతి చెందాడు. మండలంలోని శ్రీకృష్ణపట్నం – భూపాలపట్నం మధ్య సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేట నుంచి పుణ్యక్షేత్రానికి ట్రాలీపై జేసీబీని తరలిస్తున్నారు. ట్రాలీపై ఇద్దరు వ్యక్తులు నిలబడి కర్రలతో విద్యుత్ తీగలను జేసీబీకి తగలకుండా పైకి లేపుతున్నారు. అయితే ఆ ఇద్దరిలో ఒకరు ట్రాలీ కుదుపునకు పడిపోవడంతో విద్యుత్ తీగలు జేసీబీకి తగిలాయి. వెంటనే స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. అయితే జేసీబీలోని డ్రైవర్ జార్ఖండ్‌కి చెందిన సహదేవ్ (50) విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడిని 108లో చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అప్పటికే అతడు చనిపోయాడని వైద్యులు తెలిపారు. కాగా.. ఈ విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా తమకు ఆస్పత్రి నుంచి సమాచారం రావాల్సి ఉందన్నారు.

ప్రశాంతంగా ఎంఈఓ–2 పోస్టుల కౌన్సెలింగ్

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఎంఈఓ–2 పోస్టుల భర్తీకి నిర్వహించిన కౌన్సెలింగ్ సోమవారంతో ప్రశాంతంగా ముగిసింది. అవిభక్త తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 64 మండలాలకు ఎంఈఓ–2 పోస్టుల నియామకానికి ఆదివారం ఈ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. తొలి రోజు 47 మండలాలకు మాత్రమే అభ్యర్థులు కోరుకోగా, మిగిలిన 17 మండలాలకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలుత 325 మంది గ్రేడ్–2 హెచ్ఎంలతో సీనియార్టీ జాబితా విడుదల చేశారు. ఎంఈఓ–2 పోస్టుకు ఆప్షన్ ఇచ్చేందుకు పలువురు హెచ్ఎంలు నిరాకరించారు. దీంతో తిరిగి 90 మందితో సీనియారిటీ జాబితా రూపొందించి, రెండో రోజు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 57 మంది నియామకాలు జరగగా, వారందరూ సోమవారం విధుల్లో చేరారు. మిగిలిన 7 పోస్టుల భర్తీకి త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి కాకినాడ సమగ్ర శిక్షా సమావేశపు హాలులో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఏడీ కె.సుబ్బారావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంఈఓ–2 పోస్టులు మంజూరు చేసి, భర్తీకి చర్యలు తీసుకోవడంపై వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఇది క్షేత్ర స్థాయిలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసే చర్యల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చారిత్రక నిర్ణయమని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వరరావు, వీరవల్లి గోపీకృష్ణ 'సాక్షి'కి తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ముమ్మిడివరం: దంపతుల మధ్య గొడవల నేపథ్యంలో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లికి చెందిన బళ్ల గోపాలరావు(49)కు, భార్య లక్ష్మికి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 17న గోపాలరావు పురుగుల మందు తాగాడు. అతడిని బంధువులు అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపారు.





మేడపై నుంచి పడి వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: మద్యం మత్తులో ఓ వ్యక్తి మేడపై నుంచి పడి ప్రాణాలు కోల్పోయాడు. శంఖవరం మండలం పెదమల్లాపురం శృంగధార గ్రామానికి చెందిన నాగోజు అప్పారావు (36) టెంట్‌హౌస్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. టెంట్‌హౌస్ సామాన్ల కొనుగోలు నిమిత్తం ఆదివారం కాకినాడ వచ్చాడు. తిరిగి వెళ్లే సమయానికి చీకటి పడటంతో నగరంలో ఉన్న స్నేహితుడు వెన్న నవీన్ క్రాంతి కుమార్ ఇంటికి రాత్రి బసకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇద్దరూ మద్యం తాగారు. అర్ధరాత్రి ఉక్కపోత కారణంగా ఇంటి బయటకు వచ్చి మేడ మీదకు ఎక్కిన అప్పారావు మద్యం మత్తులో కిందకు పడిపోయాడు. స్నేహితుడు గమనించి అప్పారావు భార్య రాజేశ్వరికి సమాచారం అందించాడు. ఆమె ఫిర్యాదు మేరకు కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్న ఆటో

- ముగ్గురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

ఆలమూరు: జొన్నాడ వద్ద 216ఏ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం.. పాలకొల్లు నుంచి ధవళేశ్వరం వెళుతున్న ఆటోలో డ్రైవర్ పట్నాల ప్రశాంత్, అవిడి రాంబాబు, ఎ.సత్తిబాబు ప్రయాణిస్తున్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం సమీపానికి వచ్చేసరికి ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం సడన్ బ్రేక్ వేయడంతో ఆటో అదుపు తప్పి, వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. ఆటో ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఆలమూరు 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని తీవ్ర రక్తస్రావంతో బాధ పడుతున్న క్షతగాత్రులను స్థానికుల సాయంతో ఆటోలో నుంచి బయటకు తీసి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో డ్రైవర్ ప్రశాంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు చెబుతున్నారు. ఎస్సై శివప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మరయూర్ సేవా సహకార బ్యాంకును సందర్శించిన డీసీసీబీ చైర్మన్



మరయూర్ సేవా సహకార బ్యాంకు ఆధ్వర్యాన నడుస్తున్న రూరల్ హాట్ వద్ద ఆకుల వీర్రాజు తదితరులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు కేరళలోని మరయూర్ సేవా సహకార బ్యాంకును సోమవారం సందర్శించారు. 1936లో స్థాపించిన మరయూర్ సహకార బ్యాంకు ఏటా రూ.1.28కోట్లు లాభం సాధిస్తోందని, ఇందులో 10,950 మంది సభ్యులున్నారని ఆయన తెలిపారు. డిపాజిట్లు రూ.45 కోట్లు కాగా రూ.63 కోట్ల రుణాలిచ్చారని వివరించారు. ఈ బ్యాంకు ఆధ్వర్యాన సూపర్ మార్కెట్, రైతు సేవా కేంద్రం, మెడికల్ షాపు, అంబులెన్స్, రిసార్ట్స్, రూరల్ హాట్‌లు ఉన్నాయని తెలిపారు.

జిల్లా డీసీసీబీని కూడా లాభాల బాటలో పయనింపజేసేందుకు మరయూర్ బ్యాంకు అచరరిస్తున్న విధానాలను అమలు చేస్తామని ఈ సందర్భంగా వీర్రాజు చెప్పారు. అభివృద్ధి చెందిన సహకార బ్యాంకుల సందర్శనలో భాగంగా ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి నేతృత్వంలో పలు జిల్లాలకు చెందిన డీసీసీబీ చైర్మన్లు ఈ సందర్శనలో పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

జగ్గంపేట: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ముద్దాయికి పది సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. ఏఎస్సై నూకరాజు కథనం ప్రకారం.. జగ్గంపేటకు చెందిన వైభోగుల వీర వెంకట రమణ ఎలియాస్ శ్రీను (23) 2016లో గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, వంచించాడు. పెళ్లి ప్రస్తావన తేవడంతో ముఖం చాటేశాడు. దీంతో మోసపోయానని గుర్తించిన ఆ బాలిక అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం పోలీసులు 2017లో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి వెంకటేశ్వరరావు నిందితుడు వెంకట రమణకు పదేళ్ల జైలు శిక్ష, రూ.12 వేల జరిమానా విధిస్తూ తుది తీర్పు చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీలు ప్రారంభం



హెల్త్ వర్కర్లకు బదిలీ ఉత్తర్వులు అందజేస్తున్న డాక్టర్ పద్మశశిధర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య, ఆరోగ్య శాఖ జోన్–2 పరిధిలోని హెల్త్ వర్కర్ల బదిలీల కౌన్సెలింగ్ స్థానిక రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రారంభమైంది. జోన్–2 పరిధిలో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఉన్నాయి. వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ పి.పద్మశశిధర్ బదిలీల ప్రక్రియ నిర్వహించారు. తొలి రోజు పబ్లిక్ హెల్త్ నర్స్, హెల్త్ ఎడ్యుకేటర్ క్యాడర్లకు బదిలీలు నిర్వహించి 11 మందికి ఉత్తర్వులు ఇచ్చారు. కౌన్సెలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగిందని పద్మ శశిధర్ అన్నారు. ఈ నెల 22వ తేదీ వరకు బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుంది.

గృహ నిర్మాణదారులకు సువర్ణావకాశం

- లబ్ధిదారులకు అడ్వాన్స్‌గా బిల్లు చెల్లింపు
- నిర్మాణం ఏ స్థాయిలో ఉన్నా రూ.20 వేలు
- కొత్తగా నిర్మాణం ప్రారంభించుకునే వారికీ అవకాశం
- 'తూర్పు' వ్యాప్తంగా 11,027 మంది వివరాల నమోదు



కొవ్వూరు మండలం కాపవరంలో జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

కొవ్వూరు: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకుంటున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఇప్పటి వరకూ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులతో పాటు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న వారికి సైతం అడ్వాన్స్ పేమెంట్ అందిస్తోంది. ఒక్కో లబ్ధిదారుకు ముందస్తుగా రూ.20 వేల చొప్పున బిల్లు ఇస్తున్నారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా తొలుత పునాది స్థాయి వరకూ నిర్మించుకున్న వారికి అవకాశం కల్పించారు. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ) శివప్రసాద్ శనివారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకూ పునాది స్థాయి కంటే తక్కువ (బిలో బేస్‌మెంట్ లెవెల్ – బీబీఎల్), పునాది స్థాయి (బేస్‌మెంట్ లెవెల్) వరకూ నిర్మించుకున్న వారికి మాత్రమే ఈ అడ్వాన్స్ పేమెంటు అవకాశం ఇచ్చారు. దీనికి లబ్ధిదారుల నుంచి విశేష స్పందన లభించింది. దీంతో సోమవారం మధ్యాహ్నం మరోసారి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసారి అసలు నిర్మాణ పనులు ప్రారంభించకుండా ఉన్న వారికి సైతం ఈ అవకాశం కల్పించారు. వివిధ స్థాయిల్లో నిర్మాణం పూర్తి చేసుకుని, సొమ్ములు లేక పనులు నిలిపివేసిన వారికి కూడా అవకాశం ఇచ్చారు.

తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో వివిధ దశల్లో పనులు ప్రారంభించిన లబ్ధిదారులు 39,846 మంది ఉన్నారు. వీరిలో 11,027 మంది అడ్వాన్స్ పేమెంట్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. అడ్వాన్సు కావాలనుకునే వారు గ్రామ/వార్డు సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల లాగిన్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

రూ.22.05 కోట్ల అడ్వాన్స్ పేమెంటుకు ప్రతిపాదనలు

జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్న లక్ష్యంతో గృహ నిర్మాణ శాఖ ఈ అడ్వాన్స్ పేమెంట్ విధానానికి చర్యలు తీసుకుంది. లబ్ధిదారుకు చెల్లించాల్సిన మొత్తం ఇంటి బిల్లు నుంచి ఈ మొత్తం ఇస్తారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి 9 గంటలకు నమోదైన వివరాలను బట్టి జిల్లాలో 11,027 మంది లబ్ధిదారులు అడ్వాన్స్ పేమెంట్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. అంటే ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున జిల్లా వ్యాప్తంగా రూ.22,05,40,000 మేర గృహ నిర్మాణ శాఖ అడ్వాన్స్‌గా చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 27,982 మంది బీబీఎల్‌లో ఉన్నా వారిలో 5,071 మంది అడ్వాన్స్ పేమెంట్ కావాలని కోరారు. అలాగే ప్లింత్ బీమ్ స్థాయిలో 653 మంది, బేస్‌మెంట్ లెవెల్‌లో 3,976 మంది, లింటల్ లెవెల్‌లో 746 మంది, రూఫ్ లెవెల్‌లో 581 మంది చొప్పున అడ్వాన్స్ పేమెంట్ కావాలని కోరుతున్నారు.

లబ్ధిదారులకు ఆర్థిక వెసులుబాటు



"గతంలో ఒక దశలో నిర్మాణం పూర్తి చేసిన తర్వాత అధికారులు పరిశీలించి, బిల్లుకు సిఫారసు చేసేవారు. ఇంటి నిర్మాణంపై ఆసక్తి ఉన్న లబ్ధిదారులకు ముందస్తుగా అడ్వాన్స్ పేమెంట్ చేస్తాం. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ లాగిన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. లబ్ధిదారుకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించడం వలన ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యే అవకాశం ఉంది. వివరాలు నమోదు చేసిన రెండు, మూడు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తారు."

– డి.పరశురామ్, జిల్లా గృహ నిర్మాణ అధికారి, తూర్పు గోదావరి